

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com

5
కామారెడ్డి
జిల్లా వార్తలు
సోమవారం 15 ఏప్రిల్ 2024
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.2। కనిష్ఠం 24.6

రేపు భగలాముఖి పీఠంలో అష్టమి పూజ

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 14: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపో పక్కన బీడీ వర్కర్స్ కాలనీలో ఉన్న భగలాముఖి పీఠంలో మంగళవారం అష్టమి పూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారికి వివిధ పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని పీఠానికి వచ్చే భక్తులకు కోరుకున్న కోరికలు తీరుతాయన్నారు.



ఉత్కంఠకు.. తెరపడేనా?



- నేడు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక
- అనివార్య కారణాల వల్ల వాయిదా పడితే మరుసటి రోజు ఎన్నిక
- కాంగ్రెస్‌లో కట్టప్పలతో కంగారు
- ఇప్పటికే ఒక కౌన్సిలర్ ఇన్.. మరో కౌన్సిలర్ ఔట్
- చైర్‌పర్సన్ ఎన్నికకు 26 మంది సంఖ్యా బలం అవసరం
- కాంగ్రెస్‌కు 27, బీజేపీకి 6, బీఆర్ఎస్‌కు 15, ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో ఓటు 1
- బీఆర్ఎస్ నుంచి అభ్యర్థిని నిలిపేనా?
- బీజేపీ ఎత్తులు పారేనా?

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 14: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు గత రెండు నెలల నుంచి అన్ని పార్టీల నాయకులు, కౌన్సిలర్‌లలో నెలకొన్న ఉత్కంఠకు నేటితో తెరపడనుందా లేదంటే మరుసటి రోజుకు వాయిదా పడనుందనే సందిగ్ధం నెలకొంటుంది. బీఆర్ఎస్ పార్టీ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టి బీఆర్ఎస్‌లోని పలువురు కౌన్సిలర్ల మద్దతుతో పదవి నుంచి దింపేసిన విషయం విధితమే. అయితే నూతన మున్సిపల్ చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలని ఎన్నికల కమిషన్ సూచించడంతో జిల్లా అధికారులు ఎన్నికకు ఏర్పాటు చేశారు. ఆర్డీవో రంగనాథ్ ఆయా కౌన్సిలర్లకు సైతం సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై ఇప్పటికే నోటీసులను సైతం జారీ చేశారు. ఒక వేళ అనివార్య కారణాల వల్ల ఎన్నిక వాయిదా పడినా మంగళవారం నిర్వహించేందుకు సిద్ధమైనట్లు ఆ నోటీసుల్లో వివరించారు. అయితే ఆయా పార్టీల్లో ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో.. ఏ పార్టీ అభ్యర్థికి సపోర్టు చేస్తారనే దానిపై అయోమయం నెలకొంటుంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికే ఓ కౌన్సిలర్ క్యాంపు నుంచి వచ్చేయగా మరో బీఆర్ఎస్ కౌన్సిలర్ కాంగ్రెస్ గూటికి చేరారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు 27, బీజేపీకి 6, బీఆర్ఎస్‌కు 15 మంది కౌన్సిలర్‌లు ఉండగా బీజేపీ ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో ఓటు 1 ఉంది.

కాంగ్రెస్‌లో కట్టప్పలతో కంగారు

బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్‌ను అవిశ్వాసం ప్రవేశపెట్టి సొంత పార్టీ కౌన్సిలర్‌ల మద్దతుతో చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించివేసిన కాంగ్రెస్ పార్టీకి కట్టప్పలతో కంగారు నెలకొంటుంది. చైర్‌పర్సన్‌కు కావాల్సిన సంఖ్యా బలం కాంగ్రెస్‌కు ఉండగా కొందరు కౌన్సిలర్‌లు ఇతర పార్టీల వైపు పక్క చూపులు చూస్తున్నారని సమాచారం. ఇప్పటికే చైర్‌పర్సన్‌గా ఓ అభ్యర్థి వద్దంటూ కొందరు వ్యతిరేకిస్తుండడం కాంగ్రెస్ పెద్దల వద్ద సైతం తమ అభిప్రాయాలను వ్యక్తపరచడంతో చైర్ పర్సన్ ఎన్నికకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తారా లేదంటే సమాయానికి చేతిస్తారనేది చైర్‌పర్సన్ ఎన్నికలో బయటపడనుంది. అయితే క్యాంపుకు వెళ్లిన ఓ బీఆర్ఎస్ కౌన్సిలర్ తిరిగి రావడంతో కాంగ్రెస్ సంఖ్యా బలం 27 నుంచి 26కు చేరుకుందని సమాచారం. దీంతో ఆదివారం బీఆర్ఎస్ నుంచి మరో కౌన్సిలర్ మాడురి అనూష భర్త మాడూరి ప్రసన్న పార్టీలో చేరడంతో కాంగ్రెస్‌కు మరో కౌన్సిలర్ బలం చేకూరింది. మాడురి అనూష బీఆర్ఎస్ పార్టీ నుంచి చైర్‌పర్సన్‌గా పోటీ చేసేందుకు సన్నద్ధం కాగా కాంగ్రెస్ నాయకులు చక్రం తిప్పడంతో కాంగ్రెస్ కండువా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే కాంగ్రెస్ చైర్‌పర్సన్ ఎన్నికలో భాగంగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ నిర్ణయమే ఫైనల్‌గా తెలుస్తోంది. చైర్‌పర్సన్ పోటీకై గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుదొండ వనిత పేర్లు వినిపించగా ఎవరిని ప్రపోజ్ చేస్తారనేది చూడాలి.

బీఆర్ఎస్ పార్టీ నుంచి అభ్యర్థిని నిలిపేనా?

బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిని పీఠంపై నుంచి కాంగ్రెస్ అవిశ్వాసంతో దింపేందుకు ప్రయత్నించగా వారికి కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు సహకరించారు. ఆ సమయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త నిట్టు వేణు గోపాల్‌రావు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు, పలువురు ముఖ్యనాయకుల తీరుపై బీఆర్ఎస్ అధిష్ఠానం దృష్టికి తీసుకుపోయారు. పైగా ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి కౌన్సిలర్‌ల పనితీరును ఎండగట్టడంతో పాటు ఏ పార్టీలోని వారైన సరే అవినీతి రహిత కౌన్సిలర్‌కు తమ మద్దతు ఉంటుందని బహిరంగంగానే ప్రకటించారు. దీంతో అవిశ్వాసంలో బీఆర్ఎస్ పార్టీపై పడ్డ మరకలను తొలగించుకునేందుకు చైర్‌పర్సన్‌గా మళ్లీ ఆ పార్టీ నుంచి పోటీగా అభ్యర్థిని నిలిపేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందుకు గాను బీఆర్ఎస్ పెద్దలతో పలువురు కౌన్సిలర్‌లు సమావేశం ఏర్పాటు చేసి చర్చలు కూడా జరిపారని సమాచారం. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి మాడురి అనూష ప్రసన్న, గెరిగంటి స్వప్న లక్ష్మీనారాయణల పేర్లు ప్రధానంగా వినిపించాయి. ప్రస్తుతం మాడురి అనూష ప్రసన్న కాంగ్రెస్ పార్టీలో చేరడంతో గెరిగంటి స్వప్న లక్ష్మీనారాయణ పోటీలో నిల్వనున్నారని తెలుస్తోంది. అయితే కొందరు కౌన్సిలర్‌లు మాత్రం బీఆర్ఎస్ పార్టీ నుంచి అభ్యర్థిని నిలపడం కలేనని వాదనలు వినిపిస్తున్నారు. ఏది ఏమైనా నేడు నిర్వహించే సమావేశంలో చైర్‌పర్సన్ అభ్యర్థిని బీఆర్ఎస్ నిలబెడుతుందా.. కాంగ్రెస్‌లో కట్టప్పలు బయటపడితే అవిశ్వాసం మాదిరి కాంగ్రెస్ చైర్‌పర్సన్ అభ్యర్థికి సహకరిస్తుందా అనేది తేలిపోనుంది.

బీజేపీ ఎత్తులు పారేనా?

మున్సిపల్‌లో ఎప్పటి నుంచో పలు అవినీతి, అక్రమాలపై పోరాటం చేస్తూ వస్తున్న బీజేపీ చైర్‌పర్సన్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని నిలిపేందుకు కసరత్తులు చేస్తూ వస్తోంది. బీజేపీకి 6గురు మాత్రమే కౌన్సిలర్లు ఉండగా ఎమ్మెల్యేగా ఆ పార్టీకి చెందిన వెంకట రమణారెడ్డి ఉన్నారు ఆయనకు ఎక్స్‌అఫిషియో ఓటు ఉండగా ఆ పార్టీ నుంచి మొత్తం 7 ఓట్లు పడనున్నాయి. అయితే ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి చైర్‌పర్సన్ ఎన్నికపై దృష్టి సారించినట్లు సమాచారం. దీంతో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు, కాంగ్రెస్‌లోని పలువురు కౌన్సిలర్‌లు బీజేపీకి సహకరిస్తారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలువురు కౌన్సిలర్‌లు ఎమ్మెల్యేతో సంప్రదింపులు జరిపారని ఆయా పార్టీలు కౌన్సిలర్‌లు చర్చించుకోవడం గమనార్హం. చైర్‌పర్సన్ ఎన్నిక సమయం వరకు ఎవరు ఏ పార్టీకి మద్దతు పలుకుతారో ఎవరికి అర్థం కాని ప్రశ్నగా మిగులుతుందని పేర్కొంటున్నారు. బీజేపీ వేస్తున్న ఎత్తులతో కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ పీఠం దక్కించుకునేనా లేదా అనేది వేచి చూడాలి.

ధాన్యం కొనుగోళ్లపై.. నిఘా!

- పొరుగు రాష్ట్రాల ధాన్యం రాకుండా చర్యలు
- సరిహద్దులపై నిఘా పెట్టిన పోలీసు, రెవెన్యూ శాఖలు
- సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు
- జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటికే 18 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- ప్రారంభమైన 103 కొనుగోలు కేంద్రాలు

కామారెడ్డి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై అధికార యంత్రాంగం పకడ్బందీ నిఘాను ఏర్పాటు చేసింది. పొరుగు రాష్ట్రాల నుంచి గతంలో ధాన్యం తెలంగాణలో విక్రయించారని నిఘా వర్గాలు తెలుపడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పొరుగు రాష్ట్రాల ధాన్యం తెలంగాణలో విక్రయించకుండా చూడాలని ఆయా జిల్లాల యంత్రాంగానికి గట్టి ఆదేశాలను జారీ చేసింది. రైతులను మోసం చేసే ప్రైవేట్ వ్యాపారులు, ట్రేడర్‌లపై నిఘా పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా జిల్లా యంత్రాంగం సైతం ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరగకుండా ఇతర రాష్ట్రాల నుంచి దళారులు ధాన్యాన్ని జిల్లాలో విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని సరిహద్దులపై పోలీసు, రెవెన్యూ శాఖలు నిఘా పెట్టాయి. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. అదేవిధంగా రైస్‌మిల్లుల్లోనూ ధాన్యం నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా పెట్టింది. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు సుమారు 18వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

ప్రైవేట్ వ్యాపారులు, ట్రేడర్లపై నిఘా

యాసంగి పంట చేతికి రావడంతో రైతులు కోతలను ప్రారంభించారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ప్రభుత్వం సైతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కొందరు రైతులు ప్రైవేట్ వ్యక్తులు, ట్రేడర్లను ఆశ్రయిస్తూ ధాన్యం విక్రయాలను జరుపుతున్నారు. రైతుల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని దళారులు, వ్యాపారులు, ట్రేడర్స్ తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దీంతో స్పందించిన ప్రభుత్వం రైతులను మోసం చేసే ట్రేడర్స్, వ్యాపారులు మిల్లులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. దీంతో అధికార వర్గాలు కొనుగోలు కేంద్రాలతో పాటు బిల్లులు, దళారులు, ట్రేడర్స్‌లపై నిఘా పెట్టారు. ధాన్యం కొనుగోలు చేసే ట్రేడర్స్, మిల్లర్‌లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల్లోనూ నిఘా

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఇప్పటికే సిద్ధమైంది. జిల్లా యంత్రాంగం సైతం కొనుగోళ్ల ప్రణాళికలను రూపొందించి కొనుగోళ్లను చేపడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం కొనుగోలు కేంద్రాలతో పాటు ధాన్యం కేటాయించిన రైస్‌మిల్లులపై నిఘా పెట్టింది. జిల్లా వ్యాప్తంగా 347 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 35 రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో, రైస్‌మిల్లుల్లో తరుగు తీయకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతుల నుంచి సరైన ధ్రువపత్రాలు తీసుకోవడంతో పాటు కేంద్రాల నిర్వాహకులు వేబిల్లులు ఇవ్వడం అందులో పొందుపరిచిన ధాన్యం తూకం మిల్లులకు వెళ్లే సరికి సమానంగా ఉందా లేదా అనే దానిపై అధికారులు నిఘా పెట్టారు. ఇలా ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరగకుండా చూస్తున్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలను సరిహద్దులుగా కామారెడ్డి జిల్లా ఉంది. ఈ రాష్ట్రాల నుంచి దళారులు, కొంతమంది వ్యాపారులు అక్రమంగా ధాన్యాన్ని జిల్లాకు తీసుకువచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తున్నారని నిఘా వర్గాలు అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చాయి. దీంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణకు ధాన్యం రాకుండా చూడాలని సరిహద్దు జిల్లాల యంత్రాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం పొరుగు రాష్ట్రల సరిహద్దులపై నిఘా పెట్టి చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. మద్నూర్ మండలం సలాబత్‌పూర్, జుక్కల్, పిట్లం మండలాల్లోని కర్ణాటక సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి రెవెన్యూ, పోలీసులు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే భారీ లోడ్లు గల వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తారని అంచనా

ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో 2 లక్షల ఎకరాలకుపైగా రైతులు వరి పంటను సాగు చేశారు. ప్రధానంగా నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ దిగువన నిజాంసాగర్, బాన్సువాడ, బీర్కూర్, బిచ్కుంద, నస్రూల్లాబాద్, పోచారం ప్రాజెక్టు కింద ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలాలతో పాటు మాచారెడ్డి, దోమకొండ, కామారెడ్డి మండలాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఈ లెక్కన యాసంగిలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని, వ్యవసాయ, పౌర సరఫరాల అధికారులు అంచనా వేశారు. అయితే కొనుగోలు కేంద్రాలకు 4 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ యాసంగి సీజన్‌లో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 347 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 103 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా 18వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటా..

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 14: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేసే ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. ఆదివారం నాగిరెడ్డిపేట మండల కేంద్ర సమీపంలోని బజార తండా వద్ద గల ఫంక్షన్‌హాల్‌లో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ అధిక మెజారిటీతో విజయం సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈసారి జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు నాగిరెడ్డిపేట మండలంలో సుమారు 24శాతం ఓట్ల మెజారిటీ వచ్చిందని, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు మండలంలో మరింత మెజారిటీ తేవాలని ఆయన పార్టీ నాయకులను, కార్యకర్తలను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత కరెంట్ సౌకర్యం, రూ.10లక్షల ఆరోగ్య బీమా, రూ.500లకే గ్యాస్ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను గ్రామాల్లో ఓటర్లకు నేరుగా వివరించాలని ఆయన కార్యకర్తలను కోరారు. రెండు సార్లు ఎంపీగా గెలిచిన బీబీ పాటిల్ పది సంవత్సరాలుగా ఎల్లారెడ్డి నియోజకవర్గం ప్రజల అభివృద్ధికి ఆయన ఎలాంటి కృషి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, బోయిని విఠల్, షాహెద్‌పాషా, లక్ష్మణ్, రాగూర్, ఇమామ్, కిష్ట య్య, నర్సింహారెడ్డి, వాసురెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షు లు, కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో లీకేజీలపై నిర్లక్ష్యం



రామాలయం వద్ద లీకేజీ అవుతున్న నీరు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 14: అసలే వేసవి కాలం భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన సమయం. అయితే ఎల్లారెడ్డిలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో లీకేజీలను అరికట్టలేకపోతున్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రామాలయం టెంపుల్ వద్ద, బీడీ కాలనీలో, లింగారెడ్డిపేట్‌లలో లీకేజీల ద్వారా మిషన్ భగీరథ ద్వారా వచ్చే తాగు నీరు వృథాగా పోతున్నాయి. మున్సిపల్ అధికారులు పట్టణ ప్రజలకు సరిపడా నీళ్ల అందించడంలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



లింగారెడ్డిపేట్‌లో..



కామారెడ్డిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

మహనీయుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 14: మహనీయుల ఆశయాలకు అనుగుణంగా సమాజంలోని ప్రజలు నడుచుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి, కమాన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాడారని అన్నారు. భారత రాజ్యాంగంను ప్రజాస్వామ్య, గణతంత్ర, లౌకిక రాజ్యంగంగా తయారు చేయడానికి అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. వెనుకబడిన వర్గాలు అందరితో సమానంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలలో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఆర్థికవేత్త అని అన్నారు. చదువుకే వ్యక్తుల తలరాతను మార్చే శక్తి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిని అధికారి రజిత, కార్యదర్శి సాయిలు, నాగరాజు, వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాళేశ్వర్ వాగు నుంచి భారీగా ఇసుక రవాణా

● చోద్యం చూస్తున్న సంబంధిత శాఖ అధికారులు

నవీపేట, ఏప్రిల్ 14: మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి ప్రతీ రోజు రాత్రి ఇసుక అక్రమ రవాణా భారీగా జరుగుతుంది. గ్రామంలో సుమారు 70 ట్రాక్టర్ల వరకు ఉండగా ప్రస్తుతం 20కి పైగా ట్రాక్టర్ల యాజమానులు ఒక్కొక్కరు స్థానిక వీడీసీకి 48వేల రూపాయల చొప్పున చెల్లించి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. రాత్రి 9గంటల నుంచి ఉదయం 5గంటల వరకు స్థానిక నాళేశ్వర్, తల్వేద మధ్యనున్న వాగుల నుంచి ఇసుకను మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నిజామాబాద్, నిర్మల్ జిల్లా బాసరకు అక్రమంగా తరలిస్తున్నారని పలువురు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా భారీగా జరుగుతున్నప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేయడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాను అరికట్టి గ్రామంలో భూగర్భ జలాలు తగ్గిపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు : ఎస్సై యాదగిరిగౌడ్

మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాహన యాజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. ఇటీవల నాళేశ్వర్ వాగు నుంచి అక్రమ రవాణా చేస్తున్న ఇసుక వాహనాలను పట్టుకోవడం జరిగింది.

● ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం రాత్రి పట్టుకోవడం జరిగిందని ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నాళేశ్వర్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం రావడంతో ట్రాక్టర్‌ను పట్టుకుని నవీపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఎస్సై పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై రచనలు చేసే కవులు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 14: సమాజిక స్పృహ కలిగి ప్రజలను నిత్యం చైతన్యవంతులను చేస్తూ రచనలు చేసే కవులను ప్రజలు తమ మనసుల్లో భద్రంగా దాచుకుంటారని, కవులు సామాజిక బాధ్యతగా కవితారచనలు చేయాలని తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందినిసిద్దారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పాంగ్రాలో జరిగిన జీవనసాఫల్య పురస్కార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "ఆలోచనల ఆవిష్కరణ" పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం నందిని సిద్దారెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా సాహిత్యం, తెలుగు సాహిత్యానికి ఎంతో సేవను, ఉద్యమ స్ఫూర్తిని అందించిందన్నారు. గోపరాజు, పంపకవి వంటి ప్రాచీన కవులు నడయాడిన ప్రాంతం అన్నారు. జిల్లాకు చెందిన ఈతరం కవులు కూడా తమ కర్తవ్యాన్ని గొప్పగా నిర్వర్తిస్తున్నారని, వారి రచనలు ఎందరినో ప్రభావితం చేస్తున్నాయని ఆయన ప్రశంసించారు. స్వర్ణ లక్ష్మణ రావు కవి వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి కుమార్తె స్వర్ణ సమత సాహిత్యసేవచేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు డాక్టర్ నాళేశ్వరం శంకర్, దారం గంగాధర్, భైస దేవదాస్, విపి చందన్‌రావు, పెందోట వెంకటేశ్వర్లు, ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక అధ్యక్షులు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు, వెంకటేశ్వర్లు, ప్రవీణ్ శర్మ, రామగిరి సుజాత, రేణుక, పద్మజరెడ్డి, రమాదేవి దేశ్‌ముఖ్, ఉప్పుఢ శ్రీవాణి, మాదవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపిస్తే కేంద్ర నిధులు తెచ్చి అభివృద్ధి చేసి చూపిస్తా

● నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్14: నిజామాబాద్ పార్లమెంట్ ఎంపీగా గెలిపిస్తే కేం ద్రంతో కోట్లడి నిధులు తెచ్చి నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆదివారం జక్రాన్‌పల్లిలో గౌడ సంఘం ఫంక్షన్‌హాల్‌లో నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండల బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై మాట్లాడుతూ కోట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చి బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే నన్నారు. వ్యవసాయ రంగానికి 24గంటల పాటు ఉచిత కరెంటు ఇచ్చారని, రైతులు సంతోషంగా పంటలు పండించుకున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో 50శాతం మంది రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చ డంలేదని, అమలు కాని పథకాల గురించి బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చక అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా లేరన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందన్నారు. బీఆర్ఎస్ గ్రాఫ్ 37శాతం పెరిగిందన్నారు. తాను ఎంపీగా గెలిపిస్తే కేంద్రంతో కోట్లడి పసుపు బోర్డును తీసుకువస్తానన్నారు. అన్ని వివర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డికి వ చ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధిచెబుతారన్నారు. బీజేపీని ఓడించే సత్తా కేసీఆర్ బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందన్నారు.ఎంపీగా గెలిపిస్తే కేంద్రంతో కోట్లడి నిధులు తెచ్చి నిజామాబాద్ పార్లమెంట్‌లో నియోజకవర్గాన్ని అన్ని విధాల విధాల అభివృద్ధి చేస్తానన్నారు. తన గెలుపు కోసం బీఆర్ఎస్ కా ర్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. పార్ల మెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.అనంతరం మాజీఎమ్మెల్సీ వీజీ.గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి విద్యుత్‌ను సరఫరా చేయకపోవడంతో 15లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా తుంగలో తొక్కిందన్నారు.ఇప్పటికీ రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమా చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు,జడ్పీటీసీ తనుజా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ఎం పీపీ తిరుపతిరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భోజన్న,మండల కోఆప్షన్‌సభ్యుడు, శ్రీనివాస్, మహేష్, ఎంపీటీసీలు పద్మ, మాజీసర్పంచ్‌లు బీఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అగ్నిప్రమాదాల నివారణ గురించి వివరిస్తున్న అధికారి



బాల్కొండలో అగ్నిమాపక వారోత్సవాలు పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్14: అనుకోకుండా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగత్తల గురించి బోధన్ అగ్నిమాపక శాఖ అధికారి గంగాదాస్ పలు సూచనలు ఇచ్చారు. ఆదివారం అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో మృతి చెందిన అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 1994లో ముంబాయిలో విక్టోరియా డాగ్‌యార్డులో ఒక నౌక అగ్నిప్రమాదం సంభవించడంతో విధుల్లో ఉన్న 66 మంది అగ్నిమాపక శాఖ సిబ్బంది మృతి చెందారని పేర్కొన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అధైర్యపడకుండా అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, నర్సయ్య, హైమద్, అబ్దుల్ రషీద్, సాయిలు, రాజశేఖర్, మొసిన్ ఖాన్ తదితులు పాల్గొన్నారు.

ఖిల్లా: అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో అగ్నిమాపక సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడుతారని వారి సేవలు ఘననీయమని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి జి.మురళీమనోహర్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన అగ్నిమాపక శాఖ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అగ్నిప్రమాద నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి వివరించారు. అగ్నిప్రమాదాల నివారణలో భాగంలో 1944 ఏప్రిల్ 14న ముంబాయి విక్టోరియా డాక్ యార్డులో మరణించిన 66 మంది సిబ్బందికి నివాళులర్పించారు. వారి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి వి.భానుప్రతాప్, నర్సింగ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తారని, అగ్ని ప్రమాద నివారణ పద్ధతులను ప్రతీఒక్కరు పాటించి దేశ సంపదను కాపాడుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ డి.శేఖర్, టి.హరికృష్ణ, పీసీలు హన్మాన్‌చారి, నరేష్,డీఓపీ సుబాష్, తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం 50వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం



పువ్వుల అలంకరించిన శ్రీరామచంద్రుడు

ముప్కాల్, ఏప్రిల్14: మండలంలోని రెంజర్ల గ్రామంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని కోదండ రామ 50వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మండల దీక్ష తీసుకున్న స్వాములు, ప్రధాన అర్చకులు నాగరాజు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు మొదటి రోజు అంగ రంగా వైభవంగా శాస్త్రోక్తంగా అంకురారోహణ, దేవతహ్వాన, సాయంత్రం 6గంటలకు సహస్ర దీపాలంకరణ, 1000దీపాల నడుమ రామయ్య దర్శనమిచ్చారు. రెండవ రోజు సోమవారం హోమం, హన్మాన్ వాహనసేవ, మూడో రోజు మంగళవారం గరుడ వాహనసేవ, నాల్గవ రోజు బుధ వారం శ్రీరామ నవమి, 10.30నుంచి 12.30వరకు అభిజిత్ లగ్న మూహుర్తంలో సీతరామచంద్రస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం 6గంటలకు సాయంత్రం రథోత్సవం రాత్రి 9.30సాంస్కృతిక కార్యక్రమం సంగీత్ దీపావళి నిర్వహించబడును. స్వామివారి కళ్యాణానికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని రంగులతో వివిధ రంగుల పువ్వులతో, విద్యుత్ దీపాలతో చలువ పందిరి అలంకరించారు. 5న గురువారం ఉత్సవమూర్తులకు గోదావరిలో స్నానం చేయించి తొమ్మిదవ రోజు ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఊరూర కొనసాగుతున్న హనుమాన్‌దీక్షలు

● నియమ నిష్టలతో అంజన్న పూజల్లో తరిస్తున్న భక్తులు ● వసతులు కల్పిస్తున్న ఆలయ కమిటీలు



యజ్ఞంలో పాల్గొన్న అంజన్న దీక్షపరులు



ఆలయ ప్రదక్షణలు చేస్తున్న అంజన్న దీక్షపరులు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 14: మండలంలోని ప్రతీ గ్రామంలో హనుమాన్ దీక్షపరులతో అంజన్న ఆలయాలు కిటకిటలాడుతున్నాయి ప్రతీ రోజు నియమనిష్టలతో అంజన్న పూజలు, భజన కీర్తనల్లో అంజన్న భక్తులు తరిస్తున్నారు. ప్రతీఏటా దీక్షపరుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఉదయం, సాయంత్రం హనుమాన్ ఆలయాల్లో జైశ్రీరాం, జైహనుమాన్ శరణుఘోశ వినిపిస్తోంది. హనుమాన్ దీక్షలు చేపట్టినవారికి కష్టాలు దూరం కావడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తోందని భక్తుల విశ్వాసం. నిత్యం రెండు పూటల ప్రత్యేక పూజలు, ఉపవాసాలు, కఠన నియమాలతో దీక్షలు కొనసాగుతాయి. దీక్షలుమూడు విడతలుగా హనుమాన్ దీక్షలు చేపడతారు. హనుమాన్ దీక్షలు 41, 21, 11 రోజుల పాటు మూడు విడతలుగా దీక్షలు తీసుకుంటారు. మార్చి నెల 14 నుంచి 41 రోజులు దీక్షలు ప్రారంభమవ్వగా ఏప్రిల్ 3 నుంచి 21 రోజులదీక్షలు, 13 నుంచి 11 రోజుల దీక్షలు ప్రారంభమయ్యాయి. అంజన్నకు ఆత్మనివేదన చేసుకుంటూ దీక్షలు కొనసాగిస్తున్నారు. ప్రతీరోజుల ఉదయం 3 నుంచి 6 గంటలలోపు స్నానాదుల ముగించుకుని సూర్యోదయానికి ముందే పూజలు ముగిస్తారు. సాయంత్రం అంజన్న ఆలయాలకు చేరుకుని చన్నీటి స్నానంచేసి పూజలు నిర్వహిస్తారు. దీక్షలు పూర్తైయ్యేవరు నేలపైనే నిద్రిస్తూ ఉల్లి, వెల్లుల్లి వాడని భోజనాలు చేస్తారు, భక్తులు కాషాయం, తెల్లటి దుస్తులు ధరిస్తారు. చెడు చూడడం, వినడం, మాట్లాడడం, కోపాన్ని ప్రదర్శిచడానికి దీక్షపరులు దూరంగా ఉంటారు. భక్తులు ప్రతీ నిత్యం శ్రీరామ..జయరామ.. జయరామ జయజయరామ అంటూ మంత్రాన్ని జపిస్తారు. హనుమాన్ దీక్షలో శ్రీరామ నవమి పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ సందర్బంగా గ్రామాల ప్రధాన వీధుల గుండా భజన సంకీర్తనలు ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహిస్తారు. జగిత్యాల జిల్లా మల్యాల మండల పరిధిలోని కొండగట్టు అంజన్న ఆలయానికి భక్తులు కాలినడకనవెళ్లి మొక్కలు చెల్లించుకుంటారు. ఈ నెల 23న హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ముమ్మరంగా సాగుతున్నాయి.

అంజన్నదీక్షలతో మానసిక ప్రశాంత

అంజన్న దీక్షలతో మానసిక ప్రశాంతత లభిస్తుంది దీక్షలతో రోజువారి దినచర్యలో మార్పులు, దూవారధనలతో భక్తిభావం పెరుగుతుంది. చన్నీటిస్నానం, కటికనేలపై నిద్ర ఆరోగ్యకరం, దీక్షపరుల కోపతాపాలు దూరమై స్నేహాభావం, గౌరవంభావం కలిగిస్తుంది. దేవచింతన కలుగుతుంది. సమయపాలన లభిస్తుంది. తానుగత 2006 నుండి అంజన్నదీక్షలు చేపడుతున్నాను ఈ ఏడాదితో 18 సంవత్సరాలుపూర్తిఅయ్యాయి. ఈ దీక్షలు నిరంతరం కొనసాగుతుందన్నారు.

\- సుంకరి నవీన్ కుమార్ గురుస్వామి కమ్మర్‌పల్లి

కోడ్ కూసినా అమలు కాని నిబంధనలు

● గ్రామాల్లో విచ్చల విడిగా బెల్ట్ షాపులు

● కన్నెత్తి చూడని అధికారులు

రుద్రూరు, ఏప్రిల్ 14: పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూసింది. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, అంబం తదితర గ్రామాల్లో కోడ్ నిబంధనలు అమలు కావడం లేదు. గ్రామాలలో విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్ షాపుల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. యధేచ్చగా షాపులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు మాముళ్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణదారులు గ్రామాలలో బెల్ట్ షాపుల నిర్వాహకులకు ప్రోత్సహిస్తూ మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తుంది.

● విచ్చలవిడిగా బెల్టు షాపులు

రుద్రూరు మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, అంబం, ఆయా గ్రామ పంచాయితీల పరిధిలోని బెల్ట్ షాపులు ఒక్కో గ్రామంలో రెండు నుంచి ఐదు వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాలలో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని మందుబాబులు మద్యం తాగి గ్రామాల్లో రెచ్చిపోతున్నారని బెల్ట్ షాపుల వల్ల పేద కుటుంబాలు రోడ్డు మీద పడుతున్నాయని మద్యానికి బానిసై గ్రామాల్లో గొడవలకు దారి తీస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

● అమలు కాని ఎన్నికల నిబంధన

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్చి 16 నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. అనుమతి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహించవద్దని మద్యం అమ్మకాలు చేయవద్దు అని ఈ నిబంధనలు తమకేమి పట్టనట్లు కొందరు గ్రామాల్లో యధేచ్చగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఎన్నికల్లో నిబంధనలు పకడ్బందీగా అమలు చేసిన ప్రస్తుతం ఇంకా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టడంలో అధికారులు దృష్టిసారించడం లేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్నికల నిబంధనల ప్రకారం గ్రామాల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీలో రజక సంఘాల సభ్యుల చేరిక



మోర్తాడ్‌లో సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన రజక సభ్యులు

మోర్తాడ్, ఏప్రిల్14: మండల కేంద్రంలోని ప్రజా భవన్‌లో ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో నాటి రజక సంఘ యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గిర్మాజీగోపి, పుప్పాల అశోక్, వీడీసీ అధ్యక్షుడు అశోక్, రామకృష్ణ, బాబు, రజక యువకులు పాల్గొన్నారు.

టీయూలో ఘనంగా జార్జిరెడ్డి వర్ధంతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 14: తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఆదివారం ఉద్యమ స్ఫూర్తి నాయకుడు జార్జిరెడ్డి 52వ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యు ప్రతినిధులు జయంతి, ప్రిన్స్‌లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు జార్జిరెడ్డి ఆశయసాధన కోసం ముందుకు సాగాలని ఉద్యమ స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్టు

నవీపేట,ఏప్రిల్14: మండలంలోని జన్నేపల్లికి చెందిన మక్కల సాయిలు(45)ను గొంతు నులిమి హత్య చేసిన అతని భార్య రేఖను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. ప్రతిరోజు మద్యం సేవించి వేధిస్తుండడంతో శుక్రవారం తెల్లవారుజామున నిద్రలో ఉన్న సాయిలును భార్య రేఖ గొంతు నులిమి హత్య చేసిందని ఆయన పేర్కొన్నారు. సాయిలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని నమ్మించడానికి ఆమె ప్రయత్నించిందని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు సాయిలు మెడకు గాయాలు ఉండడంతో తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు విచారణ చేయగా సాయిలును తానే గొంతు నులిమి హత్య చేసినట్లు భార్య రేఖ అంగీకరించిందని ఎస్‌ఐ తెలిపారు. రేఖను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని జన్నేపల్లిలో మక్కల సాయిలు ఈ నెల 12న హత్యకు గురైన విషయం విదితమే.

ప్రాణం తీసిన మూల మలుపు

మోస్రా,ఏప్రిల్14: మోస్రా మండల కేంద్రంలోని సాయిబాబా మందిరం వద్ద గల మూల మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మోస్రా గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తున్నప్పుడు పడిపోగా పెద్ద రాళ్ల తలకు బలంగా తగలడంతో అక్కడే ప్రాణం వదిలాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల మలుపు వద్ద రేడియంతో కూడిన టర్నింగ్ బోర్డు ఏర్పాటు చేయాలని మరోసారి ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా అక్కడ సంబంధిత శాఖ అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కోటగిరి,ఏప్రిల్14: పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారంకు చెందిన ఇస్లావత్ వినోద(30)అనే వివాహిత అదృశ్యమైనట్లు కోటగిరి ఏఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. వినోద ఈ నెల 10వ తేదిన కోటగిరి మండల కేంద్రంలో మార్కెట్ నిమిత్తం వచ్చి కనబడకుండా పోయింది. ఆమె ఆచూకీ కోసం బంధువులు ఇళ్లలో గాలించగా లభించలేదు. ఆమె భర్త సంతోష్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. వినోద తల్లి బీమ్లిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

హనుమాన్‌స్వామిపై డాడి చేయడం సరికాదు

కోటగిరి,ఏప్రిల్14: జిల్లా కేంద్రంలో ఈ నెల 12వ తేదిన నరేష్ అనే హనుమాన్ స్వామిపై దాడి జరగడాన్ని అఖిల భారత శ్రీ హనుమాన్ దీక్ష బోధన్ డివిజన్ కన్వీనర్ శివ ప్రసాద్ ఖండించారు. కోటగిరి మండల కేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నరేష్ స్వామిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు సురేష్, వెంకాగౌడ్, సాయిలు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ యువజన అధ్యక్షుడిగా సంతోష్

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్14: క్షత్రియ సమాజ్ యువజన అధ్యక్షునిగా సాత్‌పూతే సంతోష్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి సాత్‌పూతే తులసీదాస్ తెలిపారు. అధ్యక్ష ఎన్నికలలో నలుగురు పోటీ పడగా 59ఓట్ల మెజారిటీతో సాత్‌పూతే సంతోష్ ఎన్నిక కాగా కార్యదర్శులుగా 53కోట్ల మెజారిటీతో దుమని నీరజ్ గెలుపొందారు. దీంతో పలువురు వారిని పూలమాలలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్షత్రీయ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, క్షత్రీయ సమాజ్ అధ్యక్షుడు అజారీ మధన్‌మోహన్, కార్యదర్శి బారడ్ గంగామోహన్, కర్తన్ హరినారాయణ, రవీందర్, శ్రీనివాస్, బారడ్ కిశోర్, జీవీ.ప్రశాంత్, మధుసూదన్, భూషణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 14: ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993వ సంవత్సరంలో పదో తరగతి చదివి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకే వేదిక మీదికి చేరి సందడి చేసి, బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేందర్ రెడ్డి, బొబ్బిలి శంకర్, అంజాగౌడ్, విఠల్, విశ్వనాథ్, గంగా ప్రసాద్, హన్మాండ్లు, అబ్బరెడ్డి, ఆకుల కవిత, లతాశ్రీ, అనిత, సునీత తదితరులు ఉన్నారు.


కాటేపల్లి తండాలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

'బీబీ పాటిల్ గెలుపే లక్ష్యంగా పని చేద్దాం'

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 14: జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి బీబీ పటేల్ మరోసారి గెలిపించే లక్ష్యంగా పని చేద్దామని బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కాటేపల్లి తండాలో బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ పటేల్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ మరోసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు అశోక్ పటేల్, సంజయ్ పటేల్, బీజేవైఎం బామన్ జేతిలాల్, శ్రీచంద్, అశోక్ పాల్గొన్నారు.


మొండి బసవన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా మొండి బసవన్న ఆలయ వార్షికోత్సవం

బీర్కూర్, ఏప్రిల్ 14 : మండల కేంద్రంలో ఆదివారం మొండి బసవన్న ఆలయ వార్షికోత్సవ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. శివ లింగానికి అభిషేకం చేయడంతో పాటు నందీశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి బసవన్నను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

హనుమాన్ దీక్షా స్వాముల మండల భిక్ష

నసురుల్లాబాద్, ఏప్రిల్ 14: మండలంలోని మైలారం గ్రామంలో ఆదివారం హనుమాన్ దీక్షా స్వాములు మండల భిక్షా ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిట్ల కృష్ణ మహరాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ భిక్ష కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి 338 స్వాములు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి సాయాగౌడ్ గురుస్వామి, గురుస్వామి రాజు, దత్తు స్వామి, నసురుల్లాబాద్ మండల కన్వీనర్ మేకల రాములు స్వామి, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌శెట్కార్‌కు 15వేల మెజారిటీ ఇవ్వాలి

● ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

లింగంపేట, ఏప్రిల్ 14: మండలంలో సురేష్‌శెట్కార్‌కు 15వేల మెజారిటీ ఇవ్వాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. ఆయన ఆదివారం లింగంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బిజినెస్‌ల కోసమే బీబీ పాటిల్ ఎంపీగా పోటీ చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామని ఆయన తెలియజేశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా ఆదుకుంటానని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, సంతోష్‌రెడ్డి, నాయకులు రాజయ్య, నయీం, ఖయీం, ఇబ్రహీం, సాయికుమార్, ఫతియోద్దీన్, రాజులతో పాటు నాయకులు ఉన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేందర్

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 14: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎల్లారెడ్డి తహసీల్దార్ మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద రైతులకు తాగునీటి వసతి కల్పించాలని ధాన్యం కొనుగోలు వేగం పెంచాలని రైతులకు అన్యాయం జరిగితే చర్యలు తప్పవని అదే విధంగా లారీల కొరత అంటే తమ దృష్టికి తీసుకురావాలని సెంటర్ నిర్వాహకులకు తెలిపారు. ఆయనతో పాటు గిరిధర్, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..


లింగంపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

జిల్లాలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు సంఘాల ఆధ్వర్యంలో రెల్వేకమాన్ వద్ద, మున్సిపల్ కార్యాలయం, అశోక్ నగర్ కాలనీలలో గల ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. బీఆర్ఎస్, హిందూవాహిని, ఎంఆర్‌పీఎస్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, తదితర ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిలు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, యువజనవిభాగం అధ్యక్షుడు భానుప్రసాద్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భాగయ్య, విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, కార్యదర్శి రాజు, పట్టణ అధ్యక్షుడు వెంకటస్వామి, ఎన్‌జీవో ఫౌండర్ జీవన్ నాయక్, సంతోష్‌రెడ్డి, కళ్యాణ్, సుభాష్, మౌనిక, పూజిత, నవనీత తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: అంబేద్కర్ జయంతి సందర్భంగా పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో నాయకులు, గ్రామస్థులు అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతి కోసం పనిచేసిన వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. అలాగే జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ మాట్లాడుతూ.. పీడిత ప్రజల కోసం, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు విఠల్‌రావ్ పటేల్, దేవిదాస్, యాదవరావ్, ఎంపీటీసీ దత్తు, లక్ష్మణ్ పటేల్, ఉప సర్పంచ్ లక్ష్మణ్, అనిల్ సేట్, తుకరాం పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్: అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఆదివారం బాన్సువాడ పట్టణంలో ఘనంగా జరిగాయి. మహాత్ముల కమిటీ, ఆర్టీసీ ఉద్యోగులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు, సీపీఐ నాయకులు, కార్మికులు, తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బాబా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ దుబాస్‌రాములు, శంకర్, విద్యుత్‌శాఖ ఏఈ నాందేవ్, ప్రమోద్‌రెడ్డి, శేఖర్‌రెడి, లక్ష్మణ్, రమేశ్, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ బన్సీలాల్, టీఎంయూ కార్యదర్శి గిరిధర్, తపస్ సభ్యులు నరసింహాచారి, శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూనేకర్ సంతోష్ తదితరులున్నారు.

బీర్కూర్: మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలను దళిత సంఘాల నాయకులు, వివిధ పార్టీల నేతలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బీర్కూర్, అన్నారం, బరంగేడ్గి, దామరంచ తదితర గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని శంకర్, సొసైటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి కొత్త కాపు కాంత్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఇక్బాల్, మాజీ సర్పంచ్ తోట నారాయణ, సొసైటీ డైరెక్టర్ బోయిని గంగాధర్, ఉప సర్పంచ్ సాయిలు, సీత లక్ష్మణ్, గోజిగం సాయిలు, నేరు విఠల్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: ఊరూరా అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. సుల్తాన్‌నగర్, మల్లూర్, మాగి, గాలి పూర్‌లతో పాటు ఆయా గ్రామాలు, మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి ఉత్సవాలను బాజా భజంత్రీలతో జయంతి ఉత్సవాలను జరిపారు. సుల్తాన్‌నగర్‌లో అధిక సంఖ్యలో మహిళలు మంగళ హారతులతో ఊరేగింపు నిర్వహించి ఘనంగా విగ్రహం వద్ద జయంతి ఉత్సవాలు జరిపారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు గైని విఠల్, మండల అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు బేగరి రాజు, నాయకులు శ్రీనివాస్, ప్రజా పండరీతో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: అంబేద్కర్ ఒక కులానికి, ఒక జాతికి అనికొందరు ప్రచారం చేస్తున్నారని, అంబేద్కర్ అందరి వాడని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ అంటరాని తనాన్ని రూపు మాపడానికి, సమ సమాజ నిర్మాణానికి ఎంతో కృషిచేశారని, రాజ్యాంగం ద్వారా అందరికి హక్కులు కల్పించారన్నారు. అంబేద్కర్ జీవితాన్ని అధ్యాయనం చేసి, ఆయన ఆశయాలకు అనుగుణంగా కలిసి పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో మద్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సాయిలు, మాజీ ఎంపీపీ ప్రజ్ఞ కుమార్, నాయకులుతుకారాం, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, పశువైద్యాధికారి బండి విజయ్, బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం అంబేద్కర్ జయంతిని అధికారులు, నాయకులు ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పెరిక శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు కంది మల్లేష్, ఖలీల్, చుంచు సాయిలు, మైసగౌడ్, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు నందు పటేల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, సాయిగౌడ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని మెంగారం, ముస్తాపూర్, లింగంపల్లి, పొల్కంపేట, శెట్పల్లి సంగారెడ్డి, పర్మల్ల, నల్లమడుగు, మోతె పలు గ్రామాలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేశారు. బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ జయంతి సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్ర నారాగౌడ్, సంతోష్‌రెడ్డి, ఫతియోద్దీన్, రాజు, రఫీక్, నయీం, ఖయ్యూంలతో పాటు నాయకులు ఉన్నారు.

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, ఆయాగ్రామాల ఎంపీటీసీలు, విండో చైర్మన్లు, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది, యువజన, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రామారెడ్డి: అంటరానితనం, వివక్షాలపై అలుపెరగని పోరాటం చేసి అస్తిత్వ ఉద్యమాలకు దశదిశలను చూపిన స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్ అని దళిత సంఘాలనాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, నర్సింగ్‌రావు, లింగం, శ్రీధర్, రాజేందర్, రవికుమార్, యాదగిరి,పాల్గొన్నారు.

సదాశివనగర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో అంబేద్కర్ విగ్రహనికి, చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళ అర్పించారు. అమర్లబండలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

తాడ్వాయి: మండలంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యునతమైన భారత రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింలు, మహేందర్‌రెడ్డి, శ్యాంరావు, సంజీవులు, సాయిలు, సంతోష్‌రెడ్డి, రవీందర్‌రావు, హోటల్‌శ్రీను, పత్తిరమేష్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహనికి దళితసంఘాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంతో పాటు గొట్టిముక్కల, సంగమేశ్వర్, ముత్యంపేట గ్రామాల్లో ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, నాగరాజ్‌రెడ్డి, తాటిపల్లి శ్రీకాంత్, నిమ్మ శంకర్,గోపాల్‌రెడ్డి, మధు, రమేష్, గణేష్, జీవన్, వెంకటేష్, లింగం పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండలంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహనికి ఆయన పూలమాలలు వేశారు. అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో మండలంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు.కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బాబురావు, ఎంపీపీ రాజ్‌దాస్, అంబేద్కర్ సంఘం నాయకులు లింగంపల్లి రాజు, పోచయ్య, ఆత్మకూర్‌బాబు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, దళితులు తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాలలోని అంబేద్కర్ సంఘ నాయకుల్ల ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జడ్పీవైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ ఆయన విగ్రహనికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎల్లావేళల కృషిచేసి ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన మహనీయుడు అంబ్కేదర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి, కో ఆప్షన్ మెంబర్ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహనికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అన్ని పార్టీల నాయకులు మండలంలోని అన్ని గ్రామాల వారు అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం గురించి వివరించారు.

బిచ్కుంద : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహనికి దళిత నాయకులు, పత్లాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహనికి మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేలు నివాళ్లు అర్పించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్ల బడుగు బలహీన వర్గాల వారు సమాజంలో ఎంతో గౌరవంగా తలెత్తుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళితసంఘాల అధ్యక్షులు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి


నసురుల్లాబాద్‌లో అంబేద్కర్ జయంతిలో పాల్గొన్న నాయకులు


అన్నారంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు


అన్నారంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దృశ్యం

పిట్లం, ఏప్రిల్ 14: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అమలు చేస్తున్న పథకాలను చూసి ఆయా పార్టీల నాయకులు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ అన్నారు. ఆదివారం అన్నారం గ్రామంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్‌కు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయా పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, శేఖర్, సాయిలు, గంగరాం, సాయిలు, నర్సింగ్‌రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలంలోని మర్రితండాకు చెందిన 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్‌అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని షబ్బీర్‌అలీ కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నౌసిలాల్‌నాయక్, సీనియర్ నాయకులు గణేష్‌నాయక్, సదర్‌నాయక్, మర్రితండా, గ్రామ అధ్యక్షుడు బానోత్ శ్రీనివాస్, ధరావత్‌నాయక్, ప్రవీణ్‌నాయక్, వీడీసీ చైర్మన్ రెడ్డినాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాచారెడ్డిలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

వైస్ చాన్స్‌లర్ నియామకం తర్వాతనే బీఎడ్ కళాశాలల తనిఖీలు చేపట్టాలి

● టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 14: నూతన వైస్ చాన్స్‌లర్‌ల నియామకం తర్వాతనే బీఎడ్ కళాశాలల తనిఖీలు చేపట్టాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2006 సంవత్సరంలో ఈ ప్రాంతానికి యూనివర్సిటీ వస్తే అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తే అభివృద్ధి ఏమో కానీ అవినీతి మాత్రం జరుగుతుందని అన్నారు. ఈనెల 18 నుంచి తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ బీఎడ్ కళాశాలలను తనిఖీలను నిర్వహిస్తామని పేర్కొనడం జరిగిందని వెంటనే ఈ తనిఖీలను ఆపివేయాలని అన్నారు. గత సంవత్సరం తనిఖీలు చేసి అక్రమాలకు పాల్పడ్డ కళాశాలలపైన ఎందుకు చర్యలు తీసుకోలేదని ఇప్పుడు తనిఖీలు చేసి ఏం చేస్తారని అన్నారు. బోధన్ పట్టణంలోని శ్రీచైతన్య, సెయింట్ థామస్ కళాశాలలో 32 మంది అధ్యాపకులకు కేవలం నలుగురు మాత్రమే ఉన్నారని ఈ కళాశాలలపై గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ అనుబంధ గుర్తింపును ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ రెండు కళాశాలలో అధ్యాపకులు లేకున్న కళాశాలలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

గాంధారి, ఏప్రిల్ 14: పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ శంకర్‌నాయక్ తెలిపారు. ఎల్లారెడ్డి మాజీ శాసనసభ సభ్యుడు జాజాల సురేందర్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుండగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌లు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలరాం నాయక్, మాజీ సర్పంచ్ సత్యం, కోఆప్షన్ మెంబర్ ముస్తాఫా, రెడ్డిరాజు, మల్లేష్, పత్తి లింగం, సురేష్, సంతోష్, సీను, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	- లవ్‌గురు
శాంతి	- టిల్ స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	- గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ	
మహేశ్వరి	- ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర	- లవ్‌గురు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

